రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

శతాబ్ది పార్కు వద్ద ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ నెల 20న ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఇఇ ఎపిఎన్‌డిఎస్.ప్రభాకర్ తెలిపారు. పాత పెద్దాపురం శెట్టిగపేట, తాడితోట, కుమ్మర వీధి, నాగేశ్వరరావు వీధి, పాత బస్టాండ్, వజ్జుల వారి వీధి, మిరపకాయల వీధి, మెయిన్ రోడ్డు, ఆర్‌బి.పట్నం రోడ్డు, శివాలయం వీధి, సినిమా సెంటర్, వ్యాపార పుంత, గౌరకోనీరు కాలనీ, తలుపులమ్మ కాలనీ, కొత్తపేట, సత్తిరెడ్డి పేట, బంగారమ్మ గుడివీధి, వీర్రాజుపేట, పరదేశమ్మ కాలనీ, నువ్వులగుంట వీధి, మరిడమ్మ టెంపుల్, గోలివారి వీధి, అంకయ్య పేట, సుబ్బయ్యపేట, నవోదయ స్కూల్, తదితర ప్రాంతాలలో సరఫరా ఉండదన్నారు.

తప్పుడు డేటాతో

తల్లికి వంచన

పలువురు తల్లికి వందనానికి దూరం

ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన 'తల్లికి వందనం' జాబితాలో తప్పుడు డేటా కారణంగా పలువురు పథకానికి దూరమయ్యారు. భూమి లేకున్నా ఉన్నట్లు... ఒక్కరికే రెండు మూడు విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు... అధిక యూనిట్లు వాడినట్లు, ఫోర్ వీలర్ ఉన్నట్లు జాబితాలో రావడంతో వారు పథకానికి అనర్హులయ్యారు. వీటిని సరిదిద్దుకోవడం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి ఇంటర్ వరకూ చదివే విద్యార్థులు సుమారు 7.56 లక్షల మందికి పైగా ఉన్నారు. వీరిలో 5,22,648 మందిని అర్హులుగా గుర్తించారు. 2,34,268 మందిని వివిధ కారణాలతో పథకానికి దూరం అయ్యారు.

తూర్పు గోదావరి జిల్లాలో 1,88,226 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 1,23,779 మందిని అర్హులుగా గుర్తించారు. వారికి రూ.240 కోట్లు జమ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వారి లెక్కల ప్రకారమే జిల్లాలో 64,447 మందికి తల్లికి వందనం అందలేదు. మొత్తంగా 2.80 మంది విద్యార్థులున్నారు. కాకినాడ జిల్లాలో ఒకటి నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు 2.80 లక్షల మంది ఉన్నారు. ఇంటర్ విద్యార్థులు 48,690 వరకూ ఉన్నారు. మొత్తంగా 3,28,690 మంది వరకూ విద్యార్తులున్నారు. కాని 2.28 లక్షల మందికి మాత్రమే తల్లికి వందనం డబ్బులు జమయ్యాయి. 1,00,690 మందికి పథకాన్ని దూరం చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఒకటి నుంచి ఇంటర్‌వరకూ చదివే విద్యార్థులు 2.40 లక్షల మంది వరకూ ఉన్నారు. వీరిలో 1,70,869 మందిని అర్హులుగా గుర్తించారు. వీరికి సంబంధించి 1,12,419 మంది తల్లుల ఖాతాలో రూ.250 కోట్లు జమ చేశారు. మిగిలిని 69,131 మందికి ఈ పథకాన్ని వర్తింపజేయలేదు. అర్హుల జాబితాలో పేర్లు ఉన్న కొంత మందికి కూడా ఇంకా నగదు జమకాలేదు. వారుసైతం బ్యాంకుల చుట్టూ, పోస్టాఫీసుల చుట్టూ ఇంకా తిరుగుతూనే ఉన్నారు.



gsws-nbm.ap.gov.in/NBM/#!/ApplicationStatusCheckP

Basic Details

DISTRICT	MANDAL	SECRETARIAT CODE	SECRETARIAT NAME	CLUSTER CODE	BENEFICIARY NAME	MOBILE NUMBER
EAST GODAVARI	TALLAPUDI	10590071	POCHAVARAM	10590071001	Dake Syamala	XXXXXX9399

సెంటు భూమి కూడా లేని దాకే శ్యామల అనే మహిళకు 10 ఎకరాలు ఉన్నట్లు చూపుతున్న వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ స్టేటస్



APPLICATION NUMBER	APPLICATION DATE	APPLICATION STATUS	REMARKS
1202601760-Dake Sudeep Vincent	12-JUN-2025	Ineligible	Dry land more than and equal to 10 Acres
1202452370-Dake Roshini	12-JUN-2025	Ineligible	Dry land more than and equal to 10 Acres

10 ఎకరాలు చూపిస్తే సాగు చేసుకుంటాం...

మాది తాళ్లపూడి మండలం పోచవరం. నాకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల విడుదల చేసిన తల్లికి వందనంలో నా పిల్లలను అనర్హులుగా చూపించారు. దీనికి కారణం ఏంటని ఆరా తీస్తే నా పేరున 10 ఎకరాలకు పైగా పొలం ఉందని చెప్పారు. కనీసం ఈ పొలం ఎక్కడ ఉందో చూపిస్తే బుద్ధిగా వెళ్లి సాగుచేసుకుంటాను.

- దాకే శ్యామల, పోచవరం, తాళ్లపూడి మండలం

తప్పుడు సాకులతో ఎగ్గొడుతున్నారు...

మాది రంపయర్రంపాలెం. నా కుమార్తె సోనీ రంపయర్రంపాలెం పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. కరెంట్ బిల్లు 300 యూనిట్లు దాటిందని చెప్పి తల్లికి వందనం వేయలేదు. మేము అద్దె ఇంట్లో ఉంటున్నాము. గత ప్రభుత్వంలో బాగానే అమ్మ ఒడి వచ్చింది. కష్టపడి పనిచేసుకుంటేనే రోజు గడిచే బతుకులు మావి. లేనిపోని కారణాలతో తల్లికి వందనం ఎగ్గొడుతున్నారు.

- చాకలి రాము, రంపయర్రంపాలెం, గోకవరం మండలం

భూమి ఎక్కడ ఉందో చూపించండి...

మాకు ఇద్దరు పిల్లలు. తల్లికి వందనం అందుకునేందుకు ఇద్దరికీ అర్హత ఉంది. మాకు ఎలాంటి భూమి లేదు. కాని జాబితాలో నా పేరున మూడు కుంచాల రెండు సెంట్లు భూమి ఉందని. తన భార్యపై వేములవాడలో మూడు ఎకరాలకు పైగా భూమి ఉందని చూపారు. దీంతో ఇద్దరికీ తల్లికి వందనం నగదు జమకాలేదు. కరెంటు బిల్లు కూడా ఎప్పుడూ 300 యూనిట్లు వచ్చిన దాఖలాలు లేవు. భూమి ఎక్కడ ఉందో చూపిస్తే అద్దైనా సాగుచేసుకుంటాం.

- కట్టా రామకృష్ణ, వలసపాలక, కరప మండలం

150 యూనిట్లు కూడా ఎప్పుడూ రాలేదు...

నాకు ఇద్దరు కుమారులు. వీరిద్దరికీ తల్లికి వందనం నిధులు పడలేదు. కారణం ఏంటని ఆరా తీస్తే విద్యుత్ వాడకం 300 యూనిట్లు దాటింది, అందుకే పడలేదని చెబుతున్నారు. మాకు ఏనాడూ 150 యూనిట్లు మించి కరెంటు బిల్లు రాలేదు. విద్యుత్ కార్యాలయానికి వెళ్లి అడిగితే ఏడాది రిపోర్టు తీసి ఇచ్చారు. ఇందులో కూడా ఎక్కడా 150 యూనిట్లు కూడా దాటలేదు. ఇలాంటి కారణాలతో పథకాన్ని ఆపడం సరికాదు.

- దర్శిపూడి సూర్యలక్ష్మి, రంపయర్రంపాలెం, గోకవరం మండలం

హనుమంతరావుకు ఘన నివాళి

హనుమంతరావుకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కాకినాడ

బ వా ు వ ు ఖ ప్రజ్ఞాశాలి, కమ్యూనిస్టు నేత మోటూరు హనుమంతరావు 24వ వర్ధంతి సందర్భంగా సిపిఎం కాకినాడ నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సుందరయ్య భవన్‌లో ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. సిపిఎం జిల్లా, నగర నాయకులు వర్మ, ప్రసాద్ హనుమంతరావు చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా సెంటర్ శాఖా కార్యదర్శి కె.వీరబాబు మాట్లాడుతూ సుదీర్ఘ కాలం సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా పని చేసిన హనుమంతరావు వక్తగా, రచయితగా, పత్రికా సంపాదకునిగా, ప్రజా నేతగా, ప్రజా ప్రతినిధిగా పని చేశారని కొనియాడారు. ఎంఎల్ఏగా, ఎంఎల్‌సిగా, రాజ్యసభ సభ్యునిగా ఆయన ప్రజావాణి వినిపించారని తెలిపారు. విశాలాంధ్ర ఎడిటర్‌గా, ప్రజాశక్తి దినపత్రికకు సుదీర్ఘ కాలం ఎడిటర్‌గా పని చేసారని పేర్కొన్నారు. భార్య మోటూరు ఉదయం మహిళా సంఘం వ్యవస్థాపకుల్లో ఉన్నారని తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమంలో, పత్రికా రచనలో యువతను ప్రోత్సాహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, మలకా వెంకట రమణ, మేడిశెట్టి వెంకట రమణ, భూలక్ష్మి, రాణి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఇవిఎంల భద్రతకు పటిష్ట చర్యలు

గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

ప్రజాశక్తి-కాకినాడ

ఇవిఎం, వివిప్యాట్స్ భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్దనున్న ఇవిఎం గోదామును జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ రెవెన్యూ, ఎన్నికలు అగ్నిమాపక, పోలీస్ శాఖల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. గోదాము భద్రతకు చేపడుతున్న చర్యలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల గోదామును పరిశీలించి నివేదిక పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలోని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గోదామును పరిశీలిస్తున్నట్టు తెలిపారు. కలెక్టర్ వెంట డిఆర్ఒ జె.వెంకట రావు, జిల్లా అసిస్టెంట్ అగ్నిమాపక అధికారి సుబ్బారావు, అర్బన్ తహసీల్దార్ వి.జితేంద్ర, డిటి ఎం.జగన్నాథం రాజకీయ పార్టీల ప్రతినిధులు జి.సాయిబాబా (టిడిపి), ఎస్.అప్పారావు (బిఎస్‌పి), పి.కిషోర్ (కాంగ్రెస్), ఆర్.వెంకటేశ్వరరావు (వైసిపి), సిహెచ్.రమేష్ బాబు(బిజెపి), ఎ.సత్యనారాయణ (జనసేన), ఎంవివి.రమణ (సిపిఎం) పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న యాజమాన్యం

ఆదిత్య విద్యార్థికి అథ్లెటిక్ మీట్‌లో గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశా విద్యార్థిని పి.లక్ష్మీ వేద సంహిత సీనియర్ అథ్లెటిక్ స్టేట్ మీట్ షార్ట్ పుట్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించినట్టు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. ఈ నెల 14, 15 తేదీలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరులో సీనియర్ అథ్లెటిక్ స్టేట్ మీట్ నిర్వహించారు. ఎపి అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎపి స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో షార్ట్ పుట్ 11.27 మీటర్లు విసిరి పి.లక్ష్మీ వేద సంహిత ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ నాయుడు మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంచుతాయని, ఆదిత్య డిగ్రీ కళాశాలలలో క్రీడాకారులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. వేద సంహితను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇంచార్జి ఎన్.మూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి టి.తేజేశ్వరరావు, ఇంగ్లీష్ అధ్యాపకులు ఎల్‌వి.సాయి వరప్రసాద్ అభినందించారు.

కార్టూ'నిజం'



ఆ తల్లికి 21 మంది పిల్లలంట!!!

కార్మికుల సమ్మెకు సిఐటియు మద్దతు

కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇంజినీరింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 43వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో సిఐటియు నాయకులు పాల్గొని సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షుడు నీలపాల సూరిబాబు, సిఐటియు నాయకులు డి.క్రాంతికుమార్, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వడ్డి సత్యనారాయణ, సంఘం గౌరవాధ్యక్షులు నీలం శ్రీను మాట్లాడారు. 43 రోజులుగా ఇంజనీరింగ్ కార్మికులు నిరవధిక సమ్మె చేస్తుంటే ప్రభుత్వ స్పందించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే యూనియన్ నాయకులతో ప్రభుత్వం చర్చించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. రోజురోజుకూ నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, కానీ కార్మికులకు వేతనాలు పెరగడం లేదన్నారు. కార్మికుల వేతనాలు పెంచాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు, సంఘం నాయకులు బాసిన భద్రరావు, కె.వెంకటరమణ, ఆకుల రామకృష్ణ, వాకాడ భాస్కర్, సుంకర సత్తిరాజు, డి.రాజు, పి శ్రీను, ఎం.భద్రరావు, బి.భద్రరావు, జి.సతీష్, జి.నాగేశ్వరరావు, మహాపాతిన పాపారావు, అయ్యప్ప స్వామి, టి.సాయి, ఎస్‌కె.బషీర్, ఒ.సోనియా పాల్గొన్నారు.

బ్రాందీ షాపులకు సెలవు ప్రకటించాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 21న విశాఖలో తలపెట్టిన యోగా దినోత్సవ సందర్భంగా మద్యం షాప్‌లకు సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ, జెవివి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ జన విజ్ఞాన వేదిక జిల్లా సీనియర్ నాయకులు యు.సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. యోగా సర్వరోగ నివారిణి అని ఒక మాటలో చెప్పాలంటే అన్ని సమస్యలూ యోగాలో పరిష్కారం అవుతాయని భావిస్తున్న పాలకులు అటువంటి రోజు బ్రాందీ షాపులు మూసేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో పేదరికం పెరుగుతోందని, ఉపాధి లేక చాలా ఇబ్బందులకు ప్రజలు గురవుతున్నారన్నారు. నిత్యావసర అన్ని రకాల ధరలు పెరుగుదలతో ప్రజలు అల్లాడుతున్నారన్నారు. మరో ప్రక్క ప్రభుత్వాలు మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు కొనసాగించడం వలన తెచ్చుకున్న కూలి డబ్బులు మద్యానికి ఖర్చు చేసే పరిస్థితులు దాపురిస్తున్నాయన్నారు. మద్యం మహమ్మారి వల్ల కుటుంబాల్లో ఘర్షణ వాతావరణం నెలకొంటోందన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.సింహాచలం పాల్గొన్నారు.

వైసిపి రైతు విభాగం కార్యదర్శిగా లక్ష్మణరావు

ప్రజాశక్తి-రౌతులపూడి

వైసిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ఎ.మల్లవరం గ్రామానికి చెందిన కత్తిపూడి బుజ్జి సీతమ్మ సత్రం మాజీ చైర్మన్ కాకి లక్ష్మణరావు నియమితులయ్యారు. లక్ష్మణరావును మాజీ ఎంఎల్‌సి అంగూరి లక్ష్మీ శివకుమారి, జెడ్‌పిటిసి గొల్లు లక్ష్మణ్ మూర్తి, వైసిపి ముఖ్య నాయకులు వాసిరెడ్డి జమీలు, వాసిరెడ్డి భాస్కర్ బాబు, నియోజవర్గ బిసి సెల్ అధ్యక్షుడు సార్న శ్రీనివాస్ తదితరులు అభినందించారు. తన నియమకానికి సహకరించిన వైసిపి నియోజవర్గ ఇన్‌ఛార్జి ముద్రగడ గిరిబాబుకు లక్ష్మణరావు కృతజ్ఞతలు తెలిపారు.

మరిడమ్మ సంబరాల నిర్వహణపై సమీక్ష

ప్రసంగిస్తున్న డిసిసిబి చైర్మన్ బాబు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ నెల 24 న ప్రారంభమై 37 రోజులపాటు జరిగే మరిడమ్మ అమ్మవారి జాతరను ప్రశాంతంగా నిర్వహించాలని డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు అన్నారు. బుధవారం స్థానిక మరిడమ్మ ఆలయ మండపంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి వీధిలో రూ.లక్షల వ్యయంతో నిర్వహించే ఈ సంబరాలు పెద్దాపురం పట్టణానికే గర్వకారణమన్నారు. మరో ముఖ్య అతిథి మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు మాట్లాడుతూ ఈ సంబరాలను తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది వస్తారన్నారు. ఈ సంబరాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ తలెత్తకుండా ప్రశాంతంగా జరిగేలా కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జనసేన పట్టణ అధ్యక్షుడు పోలమరశెట్టి సత్తిబాబు సంబరాల నిర్వాహకుల తరుపున మాట్లాడుతూ సంబరాల నిర్వహణ సమయం కుదించడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయన్నారు. వీధి సంబరాలు నిర్వహించినప్పుడు గరగల నిమిత్తం దేవస్థానం వారు డబ్బు వసూలు నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐ వి.మౌనిక, పెంటకోట సత్తిబాబు, రాఘవ, రంధి సత్యనారాయణ, బైలపూడి అన్నవరం, తమనార లక్ష్మణ దివాకర్, ఉల్లి సత్తిబాబు, వంగలపూడి సతీష్, దేవిక పాల్గొన్నారు.

దుర్గారావును సత్కరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉండటం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఇఒ మోకా ఉమ తల్లితండ్రులను కోరారు. మండలంలోని పోలేకుర్రు మోడల్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులను చేర్పించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని కోరారు. గ్రామస్తులంతా ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవడానికి కృషి చేయాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేసి బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం విశ్వనాథపల్లి దుర్గారావును ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వెంట్రు శ్రీను, విఆర్ఎన్‌బి.ప్రసాద్, ఉంగరాల వెంకటేశ్వరరావు, నిమ్మకాయల సత్యనారాయణ మూర్తి, గ్రామ పెద్దలు రత్తయ్య, శ్రీను, ప్రధాన ఉపాధ్యాయురాలు పెంకే అమ్మాజీ, ఉపాధ్యాయులు కాశీ రవీంద్ర, వెంకటేశ్వరి, డి.రతీ పార్వతి, సిఆర్‌పి మానస, సత్యవేణి పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల అందజేత

ప్రజాశక్తి - జగ్గంపేట

నియోజకవర్గంలోని 32 మందికి సిఎం సహాయనిధి చెక్కులను టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం అందజేశారు. అనారోగ్యంతో బాధ పడుతూ, వైద్యానికి ఆర్థికస్తోమత లేని బాధితులు సిఎం సాయం కోసం అర్థించారు. వారికి సహాయం చెక్కులు రావడంతో వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, జీను మణిబాబు, ఉంగరాల రాము, పాండ్రంగి రాంబాబు, జంపన సీతారామచంద్ర వర్మ, నీలం శ్రీను, కంచుమర్తి రాఘవ, కురుకూరి వీర వెంకట చౌదరి, ఏడదల అర్జున్ రావు, కందుల జమ్మి, కందుల శివ గోవిందు, చిట్యాల బాబ్జి, పీలా మహేష్, తేలగ రెడ్డి భద్రరావు, చింతపల్లి భద్రరావు, దొమ్మ శ్రీను, బాదంపూడి ప్రకాష్ రావు, కాకిలేటి రాయుడు, కంద సత్యానంద, పల్లపు సుబ్బారావు, కోట సూరిబాబు, కందుల భద్రరావు, కట్టు అప్పారావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయి వేతనాలు చెల్లించాలి

కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు నాయకుడు

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న శ్రామికుల వేతనాల బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు కెవిపి.సత్యనారాయణ, కె.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు పొన్నాడ గ్రామంలో బుధవారం వారు పర్యటించారు. ఉపాధి శ్రామికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీలో పని చేస్తున్న శ్రామికుల వేతన బకాయిలు నిలుపుదల చేయడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాన్ని తిప్పి కొట్టాలంటే జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని కార్మికులకు సూచించారు.

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి-పెద్దాపురం

మన పెద్దాపురం ఫేస్‌బుక్ బృందం ఆధ్వర్యాన బుధవారం 150 మంది గర్భిణులకు 15 రకాల పౌష్టికాహార వంటకాలతో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ అడ్మిన్ పెద్దిరెడ్డి నరేష్ మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన దాతల సహాయ సహకారాలతో ఈ అన్నదానం నిర్వహించామన్నారు. ప్రతి బుధవారం ప్రభుత్వాసుపత్రికి వివిధ రకాల పరీక్షల కోసం, వైద్య సేవల కోసం వచ్చే గర్భిణులకు దాతల సహాయ సహకారాలతో అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు దేవిక, హైదర్ ఆలీ, జయశ్రీ, వడ్డి సత్యనారాయణ, సత్య ప్రశాంత్, నవీన్ నాని, లక్ష్మి, నాగలక్ష్మి, జి.ఉమా శేఖర్, సత్య రాణి, సందీప్, ఆనంద్, పి.లక్ష్మి సేవలందించారన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ శ్రీవల్లి, స్కూల్ చైర్మన్ లక్ష్మణ్, కొత్తిం వెంకట శ్రీనివాసరావు, రేలంగి బుజ్జి, కొమ్మిరెడ్డి బుజ్జి, రేలంగి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

ప్రజాశక్తి-కాజులూరు

సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎంపిపి మాత భారతి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి మాత భారతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు పలు శాఖల పనితీరుపై అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎంపిపి భారతి మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రజాప్రతినిధులు తెలియజేసిన సమస్యలను సకాలంలో పరిష్కరించినప్పుడే గ్రామాల పురోభివృద్ధి ఉంటుందన్నారు. ప్రధానంగా ఉపాధి కూలీలకు పూర్తిస్థాయిలో పనులు కల్పించి సకాలంలో వేతనాలు వెయ్యాలని సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వనుం వెంకట సుబ్బారావు మండల పరిషత్ ఉపాధ్యక్షులు పెద్దిరెడ్డి వెంకటరమణ, రేఖాడి విజయ పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - చాగల్లు

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఆర్‌టిసి బస్సు ఢీకొన్న సంఘటన చాగల్లు మండలం ఎస్.ముప్పవరంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...నిడదవోలు డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు పోలవరం నుంచి నిడదవోలు వైపు వెళుతుండగా రోడ్డుపై ఆగి ఉన్న ఇసుక ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సులో ఇద్దరు ప్రయాణికులు స్వల్ప గాయాలపాలయ్యారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణానికి చెందిన అంబటి కోటినాగు అనే వ్యక్తి ఈనెల 11వ తేదీ నుంచి కనిపించడం లేదని అందిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ పి.విశ్వం తెలిపారు. 11వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదని ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సిఐ తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు 9440796622 నెంబర్‌కు కాల్ చేయాలని ఆయన సూచించారు.

కౌలు గుర్తింపు కార్డులు వేగంగా ఇవ్వాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

అర్హులైన కౌలు రైతులను గుర్తించి వారికి వేగవంతంగా కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో విఆర్‌ఒలతో నిర్వహించిన మండల స్థాయి సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. వ్యవసాయ పనులు త్వరలో ప్రారంభం కానున్నందున వెంటనే ఈ కౌలు రైతుల గుర్తింపు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో నీటి తీరువా బకాయిలు పూర్తిగా వసూలు చేయాలన్నారు. ప్రజా ఫిర్యాదుల వేదికలో ప్రజల నుంచి అధికారులకు అందజేసిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దారు కాంతారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

శ్మశాన స్థలం అప్పగింత

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలం కోరంగి పంచాయతీ పరిధిలోని పలు ప్రభుత్వ ఆస్తులను పంచాయతీకి బుధవారం రెవెన్యూ అధికారులు అప్పగించారు. తహశీల్దార్ పి.త్రినాథరావు ఆదేశాల మేరకు దిండి గ్రామం, సూరేడు దంప, ఎన్‌హెచ్ 216 చెంతన ఉన్న సీతారాంపురం శ్మశాన వాటిక, రామదాసు కాలువలను పంచాయతీకి అప్పగించినట్లు కార్యదర్శి విజెవి.రమణ తెలిపారు. ఈ సర్వేలో సర్వేయర్లు కీర్తి, మణికంఠ, హర్షవర్ధిని ఆయా ప్రభుత్వ ఆస్తులకు హద్దులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, అత్తిలి బాబూరావు, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

అభయారణ్యంలో ట్రైనీ కలెక్టర్లు

ప్రజాశక్తి- తాళ్లరేవు

కోరంగి అభయారణ్యాన్ని శిక్షణ పొందుతున్న ఆంధ్ర క్యాడర్‌కు చెందిన ట్రైనీ కలెక్టర్లు బుధవారం సందర్శించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వరప్రసాద్, ఎఫ్‌బిఒ మహేష్ అభయారణ్య విశేషాలను ట్రైనీ కలెక్టర్లకు తెలియజేశారు. ఆంధ్రదర్శిని కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలను ఏడుగురు ట్రైనీ కలెక్టర్లు సందర్శించినట్లు రేంజర్ వరప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది సిద్ధార్థ, వీరభద్ర రావు, గోపీ నాగేంద్ర కుమార్, సంధ్యా రాణి, ధనలక్ష్మి, ధనుంజయ రావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీని పరిశీలించిన ఢిల్లీ బృందం

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

జగనన్న కాలనీలో ఎన్‌ఆర్‌జిఎస్‌లో నిర్మించిన రోడ్లను ఢిల్లీ బృందం బుధవారం పరిశీలించింది. కొమరగిరి పొన్నాడలో గత ప్రభుత్వంలో ఇచ్చిన జగనన్న కాలనీ స్థలాల్లో రోడ్లు నిర్మాణం ఏ విధంగా చేపట్టారనే దానిపై ఢిల్లీ నుంచి వచ్చినప ఎన్ఎల్ఎం ప్రత్యేక బందం పరిశీలించింది. రుచి స్నేహ, బాల మురళి, జాయింట్ కమిషనర్ సునీత పాల్గొన్నారు.

సిహెచ్‌సి వైద్యాధికారిగా సునీత

ప్రజాశక్తి -తాళ్లరేవు

కమ్యూనిటి హెల్త్ సెంటర్ వైద్యాధికారిగా సివిల్ అసిస్టెంట్ సర్జన్ వి.సునీత నియమితులయ్యారు. ఆసుపత్రిలో ఇప్పటికే వైద్యసేవలు అందిస్తున్న సునీతను నియమిస్తూ డిస్ట్రిక్ట్ కన్వీనర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డిసిహెచ్) నుంచి బుధవారం ఉత్తర్వులు వచ్చినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఇటీవల ఆసుపత్రిలో శిశు మరణం నేపథ్యంలో ఇప్పటివరకూ పనిచేసిన వైద్యాధికారి స్నేహలత సస్పెండ్ అవడంతో ఈ నియామకం చేపట్టారు.

ప్రసాద్, వసంతక్కకు ఘన నివాళి

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసిన వీరులు ప్రసాద్, వసంతక్క అని సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు ఆనంద్ అన్నారు. మండలంలోని రామవరంలోని రైతు కూలీ సంఘం భూములలో ఏర్పాటు చేసిన ప్రసాద్ వసంతక్కల స్థూపాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బోలే ప్రభాకర్రావు, జె.కృష్ణ, సిల్లీ రాంబాబు, వెలుగుల జయక్క, నైనపు చంద్రమ్మక్క, సరిసే సత్యనారాయణ, కుప్ప బూసయ్య, బద్దే వెంకట్రావు, సరగడ రమణ పాల్గొన్నారు.

20న విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట ఆర్ అండ్ బి రోడ్ విస్తరణ పనుల నేపథ్యంలో బ్రౌన్‌పేట నుంచి కోదండరాంపురం వరకూ విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లు మార్చే ప్రక్రియ చేపట్టనున్నారు. 20వ తేదీ శుక్రవారం ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంని ఇఇ ఎపిఎస్‌డిఎస్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పువారి సత్రం నుంచి వచ్చే 11 ఫీడర్ల పరిధిలోని టిడ్ కో అపార్ట్‌మెంట్స్, పిఠాపురం రోడ్, 11 కెవి జల్లూరు వ్యవసాయ ఫీడర్ పరిధిలోని వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

యానాం వార్తలు

నివాళులర్పిస్తున్న ఆర్‌ఎఒ మునిస్వామి, ఇతరులు

ఝాన్సీ లక్ష్మీబాయికి ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

రాణి ఝాన్సీ లక్ష్మీబాయి వర్ధంతి సందర్భంగా బుధవారం సమాచార శాఖ ఆధ్వర్యంలో ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్ బీచ్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి ఆర్‌ఒఎ మునిస్వామి, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, సిఐ అడలరసన్, ట్రాఫిక్ ఎస్ఐ నూకరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొల్లు ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో ఆరోగ్యకరమైన జీవనం

ప్రజాశక్తి - యానాం

జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్ డిపార్ట్మెంట్, టూరిజం డిపార్ట్మెంట్ సంయుక్తంగా 25 రోజుల కౌంట్ డౌన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో భాగంగా బుధవారం స్థానిక ఎస్ఎస్ఎ కాన్ఫరెన్స్ హాల్లో మదర్ థెరిస్సా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, యోగాసనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్ఎఒఎ మునిస్వామి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ఆరోగ్యకరమైన జీవనానికి దోహదపడుతుందన్నారు.

భూమి పూజలో పాల్గొన్న ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - యానాం

యానాం బ్రహ్మానంద నగర్ కాలనీలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీ నిధులు సుమారు రూ.54 లక్షలతో బ్రహ్మానందనగర్ కాలనీలో రోడ్లు, డ్రైన్లు నిర్మించనున్నారు. ఎన్నో ఏళ్లుగా రోడ్లు, డ్రెయిన్లు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆ కాలనీవాసులు ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లడంతో ఎంపీ నిధులతో నిర్మించేవిధంగా తక్షణ చర్యలు తీసుకున్నారు. నిధులు కేటాయించి రోడ్ల నిర్మాణానికి సహకరించినందుకు కాలనీవాసులు ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్, ఎంపీ సెల్వ గణపతికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇ కాళ్ళ నాగరాజు, జెఇలు జ్యోతిరాజు, ప్రసాద్, గొల్లపల్లి అభిమానులు, కాలనీ వాసులు, గొల్లపల్లి కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంఎల్ఎ అశోక్

అధికారులపై ఎంఎల్ఎ గొల్లపల్లి ఆగ్రహం

ప్రజాశక్తి - యానాం

ప్రజా పనుల శాఖ (పిడబ్ల్యుడి) అధికారులపై స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిడబ్ల్యుడి ఆఫీస్‌లో బుధవారం సమావేశం నిర్వహించిన సమావేశంలో ఆర్ఎఒ మునిస్వామి తీరుని ఖండిస్తూ, అభివద్ధి పనులపై నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ, ఎంఎల్ఎ నిధులతో అభివద్ధి పనులు చేయకపోగా జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. అధికారులు మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు చేతిలో కీలుబొమ్మలా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తాను తెచ్చిన నిధులతో భూమి పూజ చేసేందుకు మాజీ మంత్రి మల్లాడిని కూడా రమ్మని పిలవడం హాస్యాస్పదమన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కిర్లంపూడి

ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా విద్యాసంస్థలు నడుపుతున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్ఎల్‌వి కళాశాల, విద్యా సంస్థ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు స్పందించిన మండల విద్యాశాఖ అధికారి ఎస్ఎల్‌వి కళాశాలకు వచ్చి పుస్తకాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకుడు చవాకుల నరసింహమూర్తి మాట్లాడుతూ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా కళాశాల ఆవరణలో పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాం అమ్ముతున్నాయిన, వాటిపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు వివిధ కోర్సుల పేరు చెప్పి అధిక మొత్తంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నరసింహమూర్తి, మణికంఠ సాయి పాల్గొన్నారు.

తల్లికి వందనం సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పెద్దాపురం

పెద్దాపురం డిఎల్‌డిఒగా బాధ్యతలు చేపట్టిన ఎం.శ్యామలను డివిజన్ పరిధిలోని 11 మండలాల ఎంపిడిఒలు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని మండలాల్లో తల్లికి వందనం పథకానికి సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా మరణించిన తల్లుల పిల్లలకు, ఇకెవైసి పూర్తికాని లబ్ధిదారులకు, సాంకేతిక కారణాల వల్ల కొంతమంది అర్హులైన వారికి ఈ పథకం అమలు కాలేదన్నారు. ఈ సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎంపిడిఒలు డి.శ్రీలలిత, హరికష్ణ, చంద్రశేఖర్, నవీన్ కుమార్, చంద్రరావు ఎంపిడిఒలు పాల్గొన్నారు.

వృద్ధులకు నూతన దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రమణయ్యపేట బర్మా కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సిద్ధాని వరలక్ష్మి వర్ధంతి సందర్భంగా వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ వరలక్ష్మి వర్ధంతిని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యులు వద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేసి భోజన వితరణ చేయడం అభినందనీయమని అన్నారు. సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణ రాజు, అడబాల రత్న ప్రసాద్, అంగన్‌వాడీ పరంజ్యోతి పాల్గొన్నారు.

పొలాల్లోకి సముద్రపు నీరు

- జియోట్యూబ్ ధ్వంసమైన వైనం
- శివారు భూముల రైతుల ఆందోళన

ప్రజాశక్తి -యు. కొత్తపల్లి

ఉప్పాడ, అమీనాబాద్ గ్రామాల్లో తీరాన్ని ఆనుకుని ఉన్న జియో ట్యూబ్ అలల తాకిటికి పూర్తిగా ధ్వంసం అవడంతో కెరటాలు ఉగ్రరూపం దాలుస్తున్నాయి. దీంతో సముద్రం నీరు రాకాసి అలలకు పొలాల్లోకి చొచ్చుకు వస్తోంది. అమీనాబాద్ శివారుల్లో రహదారి వెంట ఉన్న భూముల్లో గతంలో రైతులు వరి, వేరుసైనగ, సరుగుడు తోటలు సాగు చేసుకునేవారు. ఒకప్పుడు ఈ భూములకు సముద్రం కొన్ని వందల మీటర్ల దూరంలో ఉండేది. తీరం వెంబడి జియో ట్యూబ్ రక్షణగా ఉండేది. సముద్రంలో తుపాను ఏర్పడినప్పుడల్లా క్రమేణా సముద్రం ముందుకు రావడం, కెరటాల తాకిడికి రక్షణ గట్టు కోతకు గురికావడంతో భూములన్నీ సముద్రం పాలవుతున్నాయి. కొద్ది రోజులుగా ఎగసిపడుతున్న కెరటాలకు సముద్ర జలాలు కమ్మేశాయి. పంట కాలువలో ఉప్పునీరు ప్రవహించడంతో మూడేళ్ల నుంచి రైతులు భూములను నిరుప

పంట పొలాల్లోకి చొచ్చుకు వస్తున్న సముద్రపు నీరు

తీరంలో ఎగసిపడుతున్న అలల జోరు

యోగంగా వది లేశారు. ఉప్పాడ, అమీనా బాద్, కోన పాపపేటకు, మూల పేట తీరం వెంబడి గుళ్లు, బళ్లు, మార్కెట్లు వందల ఎకరాలు ఇప్పటికే సముద్రంలో తుపాను ఏర్పడి నప్పుడల్లా సముద్ర గర్భంలో కలిసిపోతున్నాయి. వైసిపి పాలనలో సముద్రకోత నుంచి రక్షణకోసం ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడంతో సమస్య మరింత జటిలంగా మారుతూ వచ్చింది. కూటమి ప్రభుత్వం ఇటీవల కాకినాడ నుంచి అమినాబాద్ తీరం వెంబడి రక్షణగోడ నిర్మాణానికి ప్రతిపాదించింది. రక్షణ గోడతోపాటు బీచ్ అభివద్ధికి అధికారులు డిపిఆర్ సిద్ధం చేశారు. ప్రభుత్వాలు వేగంగా తూతూ మంత్రంగా కాకు శాశ్వత పరిష్కార దిశగా రక్షణగోడ నిర్మిస్తే మిగిలిన భూములు, గ్రామాలు కడలిలో కలిసిపోకుండా దక్కుతాయని, లేకపోతే తమ గ్రామాలే కనుమరుగైపోతాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

బాల కార్మిక వ్యవస్థ చిన్నారుల ప్రతి హక్కుని హరించి వేస్తున్నందున ఈ నెల 30 వరకు వాణిజ్య సంస్థలను, షాపులను తనిఖీ నిమిత్తం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా బాలల సంక్షేమ అధికారి సిహెచ్.వెంకట్రావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పలకా, బలపం పట్టాల్సిన చేతులు మోయలేని భారాన్ని మోస్తున్నాయి అన్నారు. ఇటుక బట్టీలు, కార్ఖానాలు, హోటల్స్ తదితర వాణిజ్య షాపులలో బాలలను పనుల్లోకి పెట్టుకుని శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. పేదరికం, నిరక్షరాస్యత చిన్నారులను బడుల వైపు కాకు పనుల వైపు మళ్ళిస్తున్నారని ఇది ఎంత మాత్రం తగదన్నారు. బాలలకు విద్య, ఆరోగ్యం రాజ్యాంగం కల్పించిన హక్కులన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే బాల కార్మికుల నిర్మూలన చట్టం 1986 కింద శిక్షార్హులని వెంకటరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ శిరీష, రేలంగి బాపిరాజు, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక జగనన్న కాలనీలోని అనర్హుల ఇళ్ల పట్టాలను రద్దు చేసి అర్హులైన నిరుపేదలకు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివ గణేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివ గణేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగనన్న ఇళ్ల స్థలాల్లో 940 మంది వరకు అనర్హులు ఉన్నారన్నారు. వాటిని రద్దు చేసి ఇళ్లు లేని పేదవారికి ఇవ్వాలన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో కొండపోడు భూములకు బి.ఫారం పట్టాలను అనర్హులకు కేటాయించారన్నారు. వాటిని రద్దు చేయించి నిజమైన అర్హులకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వత్సవాయి సత్యనారాయణ రాజు, నక్కా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆటోలో వదిలేసిన బ్యాగ్ మహిళకు అప్పగింత

ప్రజాశక్తి - సామర్లకోట

పిఠాపురం నుంచి సామర్లకోట వచ్చిన ప్రయాణికురాలు ఆటోలో మర్చిపోయిన ముఖ్యమైన డాక్యుమెంట్లు కలిగిన బ్యాగ్‌ను ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు అప్రమత్తతో ఆమెకు అందజేశారు. బుధవారం ఆటోలో పిఠాపురం నుంచి సామర్లకోట వచ్చిన మహిళ ముఖ్యమైన డాక్యుమెంట్లు కలిగిన బ్యాగ్‌ను ఆటోలో మర్చిపోయింది. దీంతో సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు సిసి కెమెరాలు ద్వారా ఆటోను గుర్తించారు. బ్యాగ్‌ను కొన్ని నిముషాల్లోనే గుర్తించారు. దీంతో ఆటోలోనే ఉన్న బ్యాగ్‌ను ప్రయాణికురాలికి అందజేశారు. ట్రాఫిక్ ఎస్ఐ గరగారావుకు ప్రయాణికురాల కృతజ్ఞతలు తెలిపారు.

'కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి'

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రైతులు సాగు చేసుకునేందుకు వీలుగా కాలువల్లో పూడికలు తీస్తున్నట్టు రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ తెలిపారు. పెనుమర్తిలో కాలువల పూడికతీతను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో రైతుల పంట పొలాలకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం, ప్రైవేటు వారి సహకారంతో కాకినాడ రూరల్ మండలం, కరప మండలంలో కాలువల పూడికతీత పనులను వేగవంతంగా చేస్తున్నామని తెలిపారు. రైతులు ఎకరానికి ఎక్కువ బస్తాల పండే విధంగా కూటమి ప్రభుత్వం అన్ని విధాలా రైతులకు సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, రైతులు, విఆర్‌ఒ శివరామకష్ణ, ఎస్ఐ మూర్తి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎక్కువ మందికి పనులు కల్పించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో 23 గ్రామాల్లో ఎక్కువ మందికి ఉపాధి పనులు కల్పించాలని ఎపిఒ సుధీర్ అన్నారు. బుధవారం స్థానిక గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులపై ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన మండల స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి పనులను గుర్తించి ఎక్కువమందికి ఉపాధి కల్పించేందుకు కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన ఇంకుడు గుంటలు, పశువుల తొట్లెల పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల పరిధిలోని ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మరిడమ్మను దర్శించుకున్న తుమ్మల బాబు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారిని బుధవారం డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేద పండితులు, ఆలయ ఆసాదులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆయనకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

CHANGE OF NAME

I, **KOTHAPALLI LAKSHMI KANTHAM,** W/o. Kothapalli Abbulu, D.No. 5-235, Subbarao peta, Katheru, E.G.Distrct, A.P., Pin: 533105, I have changed my name from **KOTTAPALLI LAKSHMI KANTAM** (Old Name) to **KOTHAPALLI LAKSHMI KANTHAM** (New Name). Hence forth Iam being called **KOTHAPALLI LAKSHMI KANTHAM,** W/o. Kothapalli Abbulu, for all purpose.

CHANGE OF NAME

I, **KOTHAPALLI ABBULU,** S/o. Kothapalli Tatayya, D.No. 5-235, Subbarao peta, Katheru, E.G.Distrct, A.P., Pin: 533105, I have changed my name from **KOTTAPALLI ABBULE** (Old Name) to **KOTHAPALLI ABBULU** (New Name). Hence forth Iam being called **KOTHAPALLI ABBULU,** S/o. Kothapalli Tatayya, for all purpose.

CHANGE OF NAME

I, **KOTHAPALLI PRUDHVI KISHORE,** S/o. kothapalli Abbulu, D.No. 5-235, Subbarao peta, Katheru, E.G.Distrct, A.P., Pin: 533105, I have changed my name from **KOTTAPALLI PRUDHVI KISHORE** (Old Name) to **KOTHAPALLI PRUDHVI KISHORE** (New Name). Hence forth Iam being called **KOTHAPALLI PRUDHVI KISHORE,** S/o. Kothapalli Abbulu, for all purpose.

గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-తుని

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ అన్నారు. బుధవారం తుని రూరల్ డి.పోలవరంలో నూతనంగా నిర్మించిన రోడ్డును ప్రభుత్వ విఫ్ తుని ఎంఎల్ఎ యనమల దివ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఎంపీ శ్రీనివాస్, యనమల దివ్య ప్రభుత్వ పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ సంపూర్ణం ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.కోట్లు వెచ్చించి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రధాన రహదారులను నిర్మాణం చేపడుతున్నామని, గడిచిన ఏడాది కాలంలో ఎన్నడూ లేనంత విధంగా రోడ్లను ఆధునికరించామని అన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో రోడ్ల నిర్మాణాలు చేపట్టలేదని ఆయన విమర్శించారు. కూటమి నాయకులు పలక సోమేశ్వరరావు, చింతంనీడి అబ్బాయి, సుర్ల లోవరాజు, యనమల లక్ష్మణరావు, అరిగెల నర్సింహమూర్తి, జనసేన నాయకులు బోనం చినబాబు, దండెం రామకృష్ణ, స్థానిక నాయకులు అలమండ వెంకట రమణ, వాడబోయిన సాంబయ్య, పెనుబోతుల నూకరాజు, బర్ల చిన్న, బర్ల గోవిందు, సుర్ల నానాజీ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

(Correction of Name and Parental Detials in ICSE Records - 2025)

Issued on behalf of **Ms. Aenon Carmel Palli,** daughter of **Sri Bartha Lomeo Palli and Smt. Persis Palli,** a student of **St.Joseph's Convent School, Kakinada (Centre No: 1255186, UID: 8600590)** who appeared for the **ICSE Class X Examination - 2025,** conducted by the **CISCE, New Delhi.**

It is observed that the **Pass Certificate cum Statement of Marks (No.TY40009472)** Contains the following inaccuracies:

1. Candidate's Name: Palli Aenon Carmel - "AENON CARMEL PALLI"
2. Mother's Name: Palli Persis "PERSIS PALLI"
3. Father's Name: Palli Bartha Lomeo "BARTHA LOMEO PALLI"

Said corrections are substantiated by the **Brith Certificate** issued by the Kakinada Municipal Corporation (ID: 53301-B-334314).

Accordingly, this notice serves as a formal request to the **Council** and the **School Authorities** to effect the necessary rectifications in the official records and all consequential documentation.

Ms. AENON CARMEL PALLI and her parents unconditionally indemnify and discharge CISCE and the School, including their officials and agents, from any claims or liabilities arising there from.

Any objections, if any, must be submitted **in writing to the undersigned within seven (7) days** from the date of this publication. Failing which, the proposed corrections shall stand affirmed and acted upon.

KARRA VENU, ADVOCATE
Kakinada. #6-3-30, Dantuvari Street,
Dt:17-6-2025 Kakinada. Cell: 9849548272

దస్తావేజులు పోయినవి

పిఠాపురం మండలం, గోకివాడ గ్రామమునకు చెందిన వాసిరెడ్డి వీరభాస్కరమణి భర్త: వీరభద్రరావు గారికి పిఠాపురం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిస్ట్రేషన్ అయిన దస్తావేజు నెం.2181/2005 చెందియున్నది. సదరు దస్తావేజులను ది.10-06-2025వ తేదీన పిఠాపురంలో మా ఇంటి నుండి బ్యాంకు దగ్గరకు వెళుతుండగా మార్గమధ్యంలో అనగా కూరగాయల మార్కెట్ సమీపంలో ఎక్కడో పడిపోయినది. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాకు అందజేయగలరు.

వాసిరెడ్డి వీరభాస్కరమణి
భర్త: వీరభద్రరావు, పల్లపువీధి రామాలయం, గోకివాడ
పిఠాపురం మండలం, సెల్:9391178375

తల్లికి వందనం అమలు చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్, కాకినాడ నగర పాలక సంస్థ వివిధ విభాగాల్లో సేవలు అందిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది కుటుంబాలకు తల్లికి వందనం అమలు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ అదనపు కమిషనర్ సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ జిఒ నెంబర్ 26లో పేర్కొన్న విధంగా నగర పాలక సంస్థ శానిటేషన్ వర్కర్స్‌కు తల్లికి వందనం అమలు చేయాలన్నారు. నగర పాలక సంస్థ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల కుటుంబాల్లో విద్యార్థులకు కూడా తల్లికి వందనం పథకం అమలు చేయాలని కోరారు. దీనిపై అదనపు కమిషనర్ సుధాకర్ స్పందిస్తూ జిఒలో పేర్కొన్న అంశాలపై వివరణ తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, సీత తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

మా క్లయింటు అయిన కాకినాడ జిల్లా, రామేశ్వరం గ్రామం కాపురస్తులు అయిన **అడబాల సూరిబాబు గారి భార్య శ్రీమతి అడబాల చంద్రావతి గారు** మాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

మా క్లయింటు అయిన అడబాల సూరిబాబు గారి భార్య శ్రీమతి అడబాల చంద్రావతి గారి ఆస్తి i.e.49.57 Sq.yards మరియు అందుల డోర్.నెం. 2-178 గల ఇల్లు మొదట వారి తండ్రి గారు అయిన నక్కా పేరయ్య గారిది అయి ఉన్నది. నక్కా పేరయ్య గారు ఏ విధమైన లిఖితపూర్వకంగా పైన ఉదహరించిన ఇంటి గురించి కాగితాలు రాయకుండా కాలం చేసినారు. వారి తదనంతరం, వారికి భార్య నాకు తల్లి గారు అయిన నక్కా సత్యవతి మరియు వారి కుమార్తెలు మా క్లయింటు అయిన శ్రీమతి అడబాల చంద్రావతి గార్లు వగైరాలు ఉమ్మడిగా వారసత్వపురీత్యా అనుభవిస్తూ ఉన్నారు.

పైన ఉదహరించిన ఇంటిని మా క్లయింటు తల్లి గారు అయిన నక్కా సత్యవతి గారు మరియు మా క్లయింటు తోబుట్టువులు మా క్లయింటు కు రిజిస్టర్ సెటిల్మెంట్ దస్తావేజు రీత్యా ది.18-09-2021 **దస్తావేజు నెం.9165/2021** గా రిజిస్టర్ చేసి ఇచ్చినారు.

మా క్లయింటు ఆమె ఇంటిని కాకినాడ వాస్తవ్యులు అయిన పిల్లి నాగ మల్లేశ్వర రావు గారి కుమారుడు పిల్లి భీమరాజు గారికి విక్రయించుటకు అంగీకారం కుదుర్చుకోవడం జరిగింది.

కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా మా క్లయింటు విక్రయించే విషయంలో కానీ, నక్కా పేరయ్య గారి లీగల్ హెయిర్స్ విషయంలో కానీ ఎవరికైనను ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల ఈ దినము నుండి 7 దినములలోగా పైన ఉదహరించిన మా క్లయింటు అడ్రస్‌కు లేక మాకు కానీ తెలియపరచవలెను. తదుపరి ఎవరైననూ, ఎట్టి అభ్యంతరములైననూ తెలిపిన యెడల అవి మా క్లయింటును బైండు చేయవు. అట్టివి చెల్లనేరవు.

వక్కలంక సత్యనారాయణమూర్తి
P(V). వాణిశ్రీ, M(T).రాజశ్రీ, T.S. రత్నాకర్, అడ్వకేట్స్,
డో.నెం.7-9-29/a, సాంబమూర్తి వీధి,
రామారావుపేట, కాకినాడ.సెల్: 98490 12112

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సామర్లకోటకు చెందిన వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో 100 మంది విద్యార్థులకు వాసవి వనిత క్లబ్ నాయకులు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ నాయకులు, ఉపాధ్యాయ సిబ్బంది బిజె.శేష సాయి, కె.అరుణ, ఎఎల్‌వి.కుమారి, ఎ.శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

కోర్టు నోటీసు

గౌరవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి (అదనపు సివిల్ జడ్జి జూనియర్ డివిజన్) రామచంద్రపురం
ఓ.ఎస్. నెం.224/2022

Between: గెద్దం శ్రీనివాసరావు -వాది
1. జుత్తిగ వీరబ్రహ్మం
2. జుత్తిగ శ్రీను -ప్రతివాదులు

1వ ప్రతివాది చిరునామా:
జుత్తిగ వీరబ్రహ్మం, తండ్రి: ఏడుకొండలు, హిందూ, వయస్సు:48, వృత్తి: వ్యాపారం, ఇంటి నెంబర్ 5-158, కొత్త ఇళ్ళు వద్ద, దంగేరు, కె.గంగవరం మండలం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

Defandant-1 (మొదటి ప్రతివాది) పై నెంబర్ గల దావా ఓ.ఎస్. 224/2022 లో మీరు మొదటి ప్రతివాదిగా ఉన్నారు. మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికీ మీరు తీసుకోని కారణంగా గౌరవ కోర్టు వారు ఈ నోటీసును పేపర్ పబ్లికేషన్ వేయమని ఆదేశాలు ఇచ్చి ఉన్నారు. తదుపరి వాయిదా ది. 24-6-2025 గా ఉంది. కావున పై తేదీన మీరు గానీ, మీరు నియమించిన న్యాయవాది గానీ కోర్టుకు హాజరు కావాల్సిందిగా గౌరవ కోర్టు వారు ఆదేశించారు. కావున మీరు ది. **24-6-2025**న రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, రామచంద్రపురం వారి సమక్షంలో హాజరు కావాల్సిందిగా కోరడమైనది. లేనిపక్షంలో దావా మీ పరోక్షంగా తీర్మానించబడును.

(కోర్టు వారి అనుమతితో)
టి.వి.గోవిందరావు,
టి.ఆర్.లక్ష్మి,
జె.ఎస్.ఎస్.చక్రవర్తి, అడ్వకేట్స్,
ఎస్.వి.బి.లా ఛాంబర్, సత్యశ్రీ రోడ్,
17-6-2025, మండపేట-533308
రామచంద్రపురం ఫోన్ :- 7416601159